క్లుప్తంగా

తైక్వాండోలో సత్తా చాటండి



తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న కోచ్ కార్తికేయన్

కర్నూలు (టౌన్): అనంతపురం పట్టణంలో ఈనెల 25, 26 తేదీల్లో నిర్వహించే రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో కర్నూలు క్రీడాకారులు ప్రతిభ చాటి పతకాలు సాధించాలని సాయి (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) కర్నూలు సెంటర్ తైక్వాండో కోచ్ కార్తికేయన్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక స్పోర్ట్స్‌అథారిటీ స్టేడియంలో 39వ జిల్లా స్థాయి తైక్వాండో జూనియర్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ తైక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్ క్రీడల్లో వ్యక్తిగతంగా రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ నేతలు వెంకటేశ్వర్లు, రాజ్ కుమార్, నాగన్న, సతీష్ కుమార్, మదు కుమార్, బాలక్రిష్ణ పాల్గొన్నారు.

ఉప్పర సంఘం జిల్లా కమిటీ నియామకం



అధ్యక్షుడు ఉప్పర శివన్న

కర్నూలు(అర్బన్): సగర, ఉప్పర సంఘం జిల్లా అధ్యక్షుడిగా కొంగనపాడు ఉప్పర శివన్నను నియమించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాడిశెట్టి గోపిరావు, ఉప్పరి సురేష్ తెలిపారు. ఆదివారం స్థానిక బీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో విద్యార్థి సంఘాల్లో పనిచేసిన అనుభవంతో పాటు ఎంబీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా శివన్న పనిచేశారన్నారు. విద్యావంతుడైన శివన్నకు జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తే సంఘం బలోపేతం అవుతుందనే ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు. అలాగే జిల్లా గౌరవాధ్యక్షులుగా యు.సత్యన్న (ఆలూరు), ప్రధాన కార్యదర్శిగా న్యాయవాది ఎల్‌వీ ప్రసాద్ (పత్తికొండ), ఉపాధ్యక్షులుగా యు.శాంతన్న (ఆదోని), బంగి శ్రీరామ్ (ఎమ్మిగనూరు), రామాంజనేయులు (బసాపురం, కోడుమూరు), యుసీ వెంకటేష్ (కర్నూలు), ప్రచార కార్యదర్శిగా భీమరాజు (ఎమ్మిగనూరు), జిల్లా సహాయ కార్యదర్శిగా యు.ఈశ్వరయ్య (గూడురు – కోడుమూరు)ను నియమించినట్లు వెల్లడించారు.

హరిత టపాసులతో దీపావళి జరుపుకోవాలి

కర్నూలు(సెంట్రల్): పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ హరిత టపాసులతో ఆహ్లాదకరంగా దీపావళి జరుపుకోవాలని ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మురారి ప్రజలకు సూచించారు. ఆదివారం నగరంలోని 48వ వార్డు రోజా వీధిలో రోజా ఐక్య సంఘం అధ్యక్షురాలు సుమలత ఆధ్వర్యంలో ముస్లింలు, క్రిష్టియన్లతో కలిసి దీపావళి వేడుకలు నిర్వహించారు. హరిత టపాసులను కాల్చడం ద్వారా పర్యావరణానికి హాని కలగదని చెప్పారు. కార్యక్రమంలో షాలుమియా, విశ్వదిరాం, చెట్టెమ్మ, నాగమద్దమ్మ, కర్రెమ్మ పాల్గొన్నారు.

26న హిందూ కార్తీక వన భోజనాలు

కర్నూలు కల్చరల్: సురభి గోశాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఓర్వకల్ మండల పరిధి కాల్వబుగ్గ సమీపంలోని భారతీయ స్ఫూర్తి కేంద్రంలో ఈనెల 26న ఉదయం 10 గంటలకు హిందూ కార్తీక వన భోజనాల కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ట్రస్ట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇ.ఎస్.మారుతీ కృష్ణన్ శర్మ, వంగాల నాగేశ్వర్ రెడ్డి తెలిపారు. గోపూజ, గోవింద నామావళి పారాయణం కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ పి.భాస్కర్ యోగి ప్రధాన వక్తగా, వికాస భారతి సంఘటన కార్యదర్శి బీవీ నాగేంద్ర ప్రసాద్ వక్తగా హాజరు కానున్నట్లు తెలిపారు. వివరాలకు 79897 19022 నంబర్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డును బాగు చేయండి



దెబ్బతిన్న వంద అడుగుల రోడ్డు

కల్లూరు: నగరంలోని నంద్యాల రోడ్డు నుంచి దిన్నెదేవరపాడు రోడ్డుకు వెళ్లే వంద అడుగుల రోడ్డు దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. ఈ వంద అడుగుల రోడ్డు నంద్యాల రోడ్డు నుంచి ప్రారంభమయ్యే చోటనే గుంత ఏర్పడింది. అక్కడి నుంచి ముందుకు ప్రయాణిస్తే రోడ్డు రెండు వైపులా ధ్వంసమైంది. ఈ రోడ్డుపై నిత్యం వందల వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఎదురుగా వచ్చే వాహనాలకు దారి ఇవ్వాలంటే ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డు దెబ్బతిన్న చోట్ల మరమ్మతులు చేయాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

కోటి సంతకాల సేకరణలో చురుగ్గా పాల్గొనాలి

కర్నూలు సిటీ: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు చురుగ్గా పాల్గొనాలని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ పిలుపునిచ్చారు. ఆదివారం కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోని 40వ వార్డు బాలాజీ నగర్‌లో ఆ వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యుడు, ఆర్‌టీఐ విభాగం అధ్యక్షుడు విక్రమసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు పాల్గొని ప్రసంగించారు. పార్టీ చేపట్టిన కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించాలన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గత వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం 17 మెడికల్ కాలేజీలకు అనుమతులు తీసుకొచ్చారన్నారు. 5 మెడికల్ కాలేజీల్లో క్లాసులు సైతం జరుగుతున్నాయని, మరో రెండు కాలేజీలను ప్రారంభించేందుకు ఎన్‌ఎంసీ మెడికల్ సీట్లు కేటాయిస్తే కూటమి ప్రభుత్వం చేతగానితనంతో తమకు సీట్లు వద్దని లేఖలు రాశారని, మిగిలిన మెడికల్ కాలేజీల్లో జరుగుతున్న పనులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిలిపి వేసిందని వివరించారు. రూ.5 వేల కోట్లతో పనులు పూర్తి చేస్తే ఎంతో మంది పేద విద్యార్థులకు వైద్య విద్య అలాగే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. నిధులు లేవనే సాకుతో మెడికల్ కాలేజీలను ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోందన్నారు. దీనిపై ప్రజలకు వివరించి సంతకాలు సేకరించాలని పిలుపునిచ్చారు. అలాగే పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. టౌన్ అనుబంధ విభాగాలు, టౌన్ కమిటీలు ఎలా ఏర్పాటు చేయాలనే అంశాలపై క్యాడర్‌కు అవగాహన కల్పించారు. పార్టీ జిల్లా కార్యదర్శి హనుమంతరెడ్డి, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు వినయ్‌కుమార్ రెడ్డి, డి.వాసు, మండల అధ్యక్షుడు మోహన్‌బాబు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు ఎం.కె వెంకటేష్, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడు గిరిప్రసాద్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొజ్జన్న, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ప్రభాకర్ రెడ్డి, సంపత్‌కుమార్, యువజన విభాగం నాయకులు మహేష్ యాదవ్, జగన్‌మోహన్ రావు, శేఖర్, సురేష్, దత్తు, మధుసూదన్, రాము, మహేంద్రగౌడ్, ప్రభుదాస్, మల్లికార్జున, దామోదర్ నాయుడు, మౌలాలి, తదితరులు పాల్గొన్నారు.



సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, ఆదిమూలపు సతీష్, మణిగాంధీ



గార్గేయపురం గ్రామ కమిటీ నాయకులతో మాట్లాడుతున్న నేతలు

పార్టీ కార్యక్రమాలను జయప్రదం చేయాలి

కర్నూలు సిటీ: గ్రామీణ ప్రాంతాల్లో పార్టీని బలోపేతం చేస్తూ ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై వైఎస్‌ఆర్‌సీపీ చేపట్టే కార్యక్రమాల్లో గ్రామ కమిటీలు, గ్రామ అనుబంధ సంఘాల నాయకులు సమన్వయంతో పనిచేసి జయప్రదం చేయాలని కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, ఆదిమూలపు సతీష్ సూచించారు. ఆదివారం సమన్వయకర్త కార్యాలయంలో కర్నూలు రూరల్ మండల పరిధిలోని గార్గేయపురం గ్రామానికి చెందిన నాయకులతో వారు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయడంపై క్యాడర్‌కు సూచనలు చేశారు. గ్రామ కమిటీలు క్షేత్ర స్థాయిలో ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న అన్యాయం గురించి వివరించాలని సూచించారు. అనంతరం వారిని గార్గేయపురం గ్రామ కమిటీల నాయకులు ఘనంగా సన్మానించారు. పార్టీ నాయకులు వినయ్‌కుమార్ రెడ్డి, మద్దిలేటిరెడ్డి, మోహన్‌బాబు రామకృష్ణ యాదవ్, గౌతం, మధుశేఖర్, చంద్రశేఖర్ రావు, కోటిరెడ్డి, నాగిరెడ్డి, అజీవుల్లా, రిహాజ్, సుభాన్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

దీపావళి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి, కలెక్టర్

కర్నూలు(సెంట్రల్): జిల్లా ప్రజలు దీపావళి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని మంత్రి టీజీ భరత్, కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు. జిల్లా ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. చీకట్లను పారద్రోలి వెలుగులు నింపే పండుగ దీపావళి అని, దుష్ట శక్తులపై దైవం, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకుంటామని, అందరి జీవితాల్లో వెలుగులు నిండాలని ఆకాంక్షించారు.

నేడు ప్రత్యేక పూజలు

కర్నూలు కల్చరల్: దక్షిణ షిరిడీగా పేరుగాంచిన ఓల్డ్‌సిటీలోని షిరిడీ సాయిబాబా దేవస్థానంలో సోమవారం దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ పాలక మండలి సభ్యులు మహాబలేష్ తెలిపారు. సాయంత్రం 6 గంటల నుంచి ఆలయంలో నక్షత్రాకారపు మెట్ల చుట్టూ దీపాలు వెలిగించే కార్యక్రమం, సామూహిక లక్ష్మీ పూజ, పల్లకీ సేవ, సామూహిక మహా మంగళ హారతి కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

21న విద్వాన్ విశ్వం జయంతి

కర్నూలు కల్చరల్: అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 21న ఉదయం 10 గంటలకు ఆదోని ఎస్‌కేడీ కాలనీలోని అక్షర శ్రీ జూనియర్ కళాశాలలో విద్వాన్ విశ్వం జయంతి కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు భాషోపాధ్యాయులు మోహన్‌రెడ్డి తెలిపారు. కథా రచయిత హరికిషన్, కలం ప్రహ్లాద్, కేసీ మల్లికార్జున అతిథులుగా పాల్గొంటారని వెల్లడించారు.

కరాటే శిక్షణను సద్వినియోగం చేసుకోండి

కర్నూలు(అగ్రికల్చర్): స్థానిక అబ్బాస్‌నగర్‌లోని రవీంద్ర స్కూల్ పక్కన పెన్షనర్స్ అసోషియేషన్ ప్రాంగణంలో ప్రముఖ కరాటే మాస్టర్ రాంబాబు పిల్లలకు శిక్షణ ఇస్తున్నారని, ఆసక్తి కలిగిన వారు సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, విశ్రాంత సీఐ ఎస్.రంగారెడ్డి సూచించారు. ప్రతి నాలుగు నెలలకోసారి శిక్షణను బట్టి కరాటే పోటీలు నిర్వహించి గ్రీన్, ఎల్లో, బ్లాక్ బెల్ట్‌లతో పాటు సర్టిఫికెట్ ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. సర్టిఫికెట్‌లు పొందిన వారికి జిల్లా, రాష్ట్ర స్థాయిలో కూడా పోటీలు ఉంటాయని తెలిపారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో కరాటే శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్‌లు అందచేశారు. కరాటే మాస్టర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు. మరిన్ని వివరాలకు అబ్బాస్ నగర్‌లోని పెన్షనర్ల సంఘం కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.



సర్టిఫికెట్లు పొందిన కరాటే విద్యార్థులు

సంప్రదాయ కళలకు ప్రోత్సాహం

కర్నూలు కల్చరల్: ప్రాచీన సంప్రదాయ కళలను ప్రోత్సాహిస్తామని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అన్నారు. ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో టీటీడీ ఆస్థాన హరికథకురాలు లక్ష్మీ మహేష్ హరికథా గానం చేశారు. 'శ్రీకృష్ణ రాయబారం'పై ఆమె చేసిన హరికథా గానం, పిడుగు చిన్న సుబ్బరాయుడు జానపద గేయాలు ఆహుతులను అలరించాయి. ఈ సందర్భంగా పత్తి ఓబులయ్య మాట్లాడుతూ.. సంప్రదాయ కళలను బతికించుకుందాం అనే నేపథ్యంలో హరికథా గానం ఏర్పాటు చేశామన్నారు. నవంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్న కర్నూలు ఉత్సవ్‌లో ప్రాచీన సంప్రదాయ కళలకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. అంతరించి పోతున్న హరికథ, బుర్రకథ, జానపద కళలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం కళాకారులను ఘనంగా సన్మానించారు. కళాక్షేత్రం మాజీ అధ్యక్షుడు దస్తగిరి, విశ్రాంత ఎంఈఓ రాజారత్నం, సభ్యులు గురుమూర్తి, రమణ, లక్ష్మీకాంతరావు, శ్రీనివాసరెడ్డి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.



కళాకారులను సన్మానిస్తున్న నిర్వాహకులు

ముగిసిన బాస్కెట్‌బాల్ పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలోని బాస్కెట్‌బాల్ రింక్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాజవర్ధన్ రెడ్డి మెమోరియల్ జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అండర్ –14 బాలుర విభాగంలో ఎథెనా స్కూల్ (ప్రథమ), ఎస్.డి.ఆర్ స్కూల్ (ద్వితీయ), బాలికల విభాగంలో ఎస్డీఆర్ స్కూల్ (ప్రథమ), ఇండస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ (ద్వితీయ), అండర్ –17 బాలుర విభాగంలో ఎస్‌డీఆర్ స్కూల్ (ప్రథమ), ఎడిఫై స్కూల్ (ద్వితీయ), బాలికల విభాగంలో మాంటే ఇంగ్లిష్ మీడియం (ప్రథమ), అథీనా స్కూల్ (ద్వితీయ) స్థానాల్లో నిలిచారు. విజేతలకు ట్రోఫీ, బహుమతులు, మెడల్స్‌ను కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అందజేశారు. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు దాదా బాషా, ముస్తాహీర్, ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు పాల్గొన్నారు.

నేటి పీజీఆర్ఎస్ రద్దు

కర్నూలు (టౌన్): ఈనెల 20వ తేదీ సోమవారం దీపావళి పండుగను పురస్కరించుకొని సెలవు కావడంతో నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు గమనించాలని, స్థానిక కాలనీల్లోని సమస్యలపై పుర మిత్ర యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

హ్యాండ్‌బాల్ కార్యవర్గం ఎన్నికలకు సిద్ధం కండి

కర్నూలు (టౌన్): రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఎన్నికలకు సిద్ధం కావాలని ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు సూచించారు. ఆదివారం స్థానిక గాయత్రీ ఎస్టేట్‌లోని రాగమయూరి సమావేశ హాలులో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. హ్యాండ్‌బాల్ ఫెడరేషన్లు రెండుగా చీలిపోయాయన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో 2021 నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఇండియాకు గుర్తింపు లేదన్నారు. ఒలింపిక్ సంఘం పరిశీలకులుగా రామాంజనేయులు, జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ విజిలెన్స్ సభ్యులు గుడిపల్లె సురేందర్ తదితరులు పాల్గొన్నారు. హ్యాండ్‌బాల్ క్రీడలో ప్రతిభ చాటి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించిన వారిని ఘనంగా సత్కరించారు. నేతలు రమణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు

నగరాభివృద్ధికి రూ.2 వేల కోట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న బాబురావు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరాభివృద్ధికి రూ.2 వేల కోట్లు కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబురావు డిమాండ్ చేశారు. పాలకుల నిర్లక్ష్యంతో నగరాభివృద్ధి కుంటుపడిందని, కనీసం ప్రజలకు మంచినీళ్లు ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. ఆదివారం కర్నూలు ఎంపీపీ హాలులో సీపీఎం న్యూసిటీ కార్యదర్శి టి.రాముడు అధ్యక్షతన కర్నూలు నగరాభివృద్ధిపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో బాబురావు మాట్లాడుతూ.. నగర జనాభా పెరిగిపోతున్నా అందుకు తగ్గట్లుగా పాలకులు, అధికారులు సదుపాయాల కల్పనలో విఫలమయ్యారని ఆరోపించారు. పాలకులు కేవలం కమీషన్ల కోసం పనిచేస్తున్నారని విమర్శించారు. టిడ్కో గృహాలను ప్రజలకు కేటాయించడం లేదని, రెండో ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణం గురించి పట్టించుకోవడం లేదన్నారు. ఏటా ఆస్తి పన్ను 15 శాతం పెంచుతున్నారని మండిపడ్డారు. తుంగభద్ర, హంద్రీ నదుల పరిరక్షణకు రక్షణ గోడలు నిర్మించాలని కోరారు. సీపీఎం నాయకులు ఎం.రాజశేఖర్, అంజిబాబు, విజయ్, నగేష్, నరసింహ, అరుణ, శ్యామల, అబ్దుల్‌దేశాయ్, షరీఫ్, రామకృష్ణ,సుధాకరప్ప, నరసింహులు, ప్రభాకర్ పాల్గొన్నారు.

- నేడు దీపావళి (నరక చతుర్దశి) పర్వదినం
- ప్రమిదలతోనే ఇంటికి అందం
- టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు తప్పనిసరి
- అధిక శబ్దాలు, పొగ వచ్చే బాణసంచాతో ముప్పు

దివ్య దీప్తుల కేళి.. దీపావళి

కర్నూలు కల్చరల్: దీపకాంతులతో ఇంటిని అలంకరించి ఆనందంగా జరుపుకునే పర్వదినం దీపావళి. అమావాస్య చీకటిని జయించి సంతోషాలను పూయించే పండగే నరక చతుర్దశి. చెడుపై మంచి గెలుపునకు ప్రతీకగా ఆనందోత్సాహాల నడుమ దివ్య కాంతుల పండుగను జరుపుకునేందుకు ప్రతి ఒక్కరూ ఉవ్విళ్లూరుతున్నారు. అయితే టపాసులు సాధ్యమైనంత తక్కువగా, జాగ్రత్తగా కాల్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీనికి తోడు పర్యావరణ పరిరక్షణకు ఎకో ఫ్రెండ్లీ టపాసులను వినియోగించాలని పలు స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ ప్రేమికులు సూచిస్తున్నారు. సుప్రీంకోర్టు సైతం కొన్ని నిబంధనలు సూచించింది. దీపావళి కాంతులు ప్రతి ఇంటా నిండాలంటే

జాగ్రత్తలు తప్పనిసరి.

బాణసంచా తయారు చేయాలంటే రసాయనాలు వాడాల్సిందే. ముఖ్యంగా కాపర్, కాడ్మియం, సీసం, మెగ్నీషియం, సీసం, జింక్, సోడియం, అల్యూమినియం, అమ్మోనియం, పొటాషియం, సల్ఫర్, బొగ్గు వాడతారు. ఒక్కో రకం టపాసును తయారు చేసేందుకు ఒక్కో రసాయనాన్ని వినియోగిస్తారు.

కలిగే ముప్పు ఇలా..

రసాయనాల వల్ల కలిగే ఇబ్బందులు ఇవీ..

రసాయనం	సమస్య
కాపర్	చిరాకు కలుగుతుంది
కాడ్మియం	రక్తప్రసరణలో ఇబ్బంది ఏర్పడుతుంది
సీసం	నరాల వ్యవస్థపై ప్రభావం
మెగ్నీషియం	మానసిక స్థిమితం కోల్పోయే ప్రమాదం
జింక్	జ్వరం, వాంతులు
సోడియం, బేరియం	కాలడం (బర్న్స్)



దీప ప్రమిదలను కొనుగోలు చేస్తున్న మహిళలు



ఆకట్టుకుంటున్న విగ్రహం

టపాసుల్ని కాల్చినప్పుడు అందులోని రసాయనాలు మండి విషపూరిత వాయువులు విడుదలవుతాయి. వాటిని పీల్చితే చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు అనారోగ్య సమస్యలు తలెత్తవచ్చు.

ప్రమిదలే ముద్దు

దీపావళి కాల్చే బాణసంచా కొందరికి ఇబ్బందిగా పరిణమిస్తోంది. ఇకనైనా వీటికి దూరంగా ఉండి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలి. బంధుమిత్రులకు మిఠాయిలు పంచడం, ఇంటికి విద్యుత్ కాంతులు వెదజల్లేలా అలంకరణ చేసుకోవడం. వివిధ ఆకృతుల్లో ఉండే ప్రమిదల్ని వెలిగించాలి. పిల్లలు మారాం చేస్తే వారికి బాణసంచా కాల్చడం వల్ల కలిగే ఇబ్బందుల్ని వివరించి నచ్చజెప్పేందుకు ప్రయత్నించాలి.

ఎకో ఫ్రెండ్లీతో..

రంగులు విరజిమ్ముతూ పెద్ద పెద్ద శబ్దాలు చే స్తూ అందరినీ ఆకట్టుకునే టపాకాయలు లేకుండా దీపావళి పండుగ పూర్తి కాదనుకుంటారు. అలాంటి వారి కోసమే ఎకో ఫ్రెండ్లీ క్రాకర్స్ అందుబాటులోకి వచ్చాయి. కాన్ ఫెట్టీ, ఫ్లవర్ పవర్, ఫేక్ నోట్, బర్స్ట్, స్నేక్‌మిక్స్ లాంటి పేర్లతో మార్కెట్‌లో దొరుకుతున్నాయి. ఇవి మామూలు బాణసంచాలా వాతావరణానికి పెద్దగా హాని కలిగించవు. వీటి ధ్వని పరిమిత దూరం వరకే ఉంటుంది. కాలుష్యం కలిగించని రంగు రంగుల మెరుపులను వెదజల్లుతాయి. కేవలం గమ్ పౌడర్, ఫాస్ఫేట్‌ను మాత్రమే ఉపయోగించి ఆధునిక టెక్నాలజీతో ఈ బాణసంచాను తయారు చేస్తున్నారు. బాణసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి.

పర్యావరణ హితం.. పండుగ ఉద్దేశం



దీపావళి పర్వదినాన్ని పర్యావరణ హితంగా జరుపుకోవాలి. పండుగ ఆనందాన్ని పూర్తిగా ఆస్వాదించాలి. మట్టి దీపాలు, కొవ్వొత్తులు, విద్యుత్ దీపాలు వెలిగించడం మంచిది. నెయ్యి దీపాలు వెలిగిస్తే ఆక్సిజన్ ఎక్కువగా వెలువడుతుంది. సంప్రదాయంలో భాగంగా టపాసులు కాల్చాలనుకుంటే ఎకో ఫ్రెండ్లీ టపాసులు కాలిస్తే పర్యావరణానికి ఎలాంటి ముప్పు ఉండదు.

– శ్రీరామ్ యాదవ్, అధ్యాపకులు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఆదోని







ఎముకలు విరుగుతున్నాయి!

కర్నూలు(హాస్పిటల్): జీవనశైలిలో మార్పులు, వ్యాయామం లేకపోవడం, శరీరంలో కాల్షియం, విటమిన్–డి తగ్గిపోవడం వంటి కారణాల వల్ల శరీరంలో ఎముకలు దెబ్బతింటున్నాయి. ఈ నెల 20న ప్రపంచ ఆస్టియోపోరోసిస్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఆర్థోపెడిక్ (ఎముకలు, కీళ్ల విభాగం) ఓపీకి రోజూ 200 మంది రోగులు చికిత్స కోసం వస్తుండగా వారిలో 20 శాతం మంది ఆస్టియోపోరోసిస్ వ్యాధిగ్రస్తులు ఉంటున్నారు. వీరిలో పురుషుల కన్నా మహిళల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. ముఖ్యంగా నడుము, వెన్నుముక, మెడనొప్పి, మోకాళ్లు, కండరాల నొప్పులతో బాధపడే వారిలో ఈ వ్యాధి కనపడుతోంది. ఇలాంటి వారికి ఆసుపత్రిలో కాల్షియం, విటమిన్–డి పరీక్షలతో పాటు అవసరమైతే డెక్సా స్కాన్ పరీక్ష చేసి ఎముకల్లో సాంద్రతను నిర్ధారిస్తున్నారు. వీటి నివేదికల ఆధారంగా ఆస్టియోపోరోసిస్ వ్యాధిని నిర్ధారించి చికిత్స చేస్తున్నారు. ఈ వ్యాధి గ్రస్తుల సంఖ్య పెరుగుతున్నా ఇందుకు సంబంధించిన మందులు మాత్రం ఆసుపత్రుల్లో లేవు. కేవలం కాల్షియం మాత్రలు ఇచ్చి పంపిస్తున్నారు.

ప్రైవేటు ఆసుపత్రుల్లోని ఆర్థోపెడిక్ వైద్యుల వద్దకు కూడా ఈ వ్యాధిగ్రస్తులు రోజూ 250 మంది వరకు చికిత్స కోసం వస్తున్నారు. వీరికి బోన్ మ్యారో డెన్సిడిటీ (బీఎండీ) పరీక్ష నిర్వహిస్తుండగా అధిక శాతం ఆస్టియోపోరోసిస్ బాధితులుగా నిర్ధారణ అవుతోంది. ఒకప్పుడు 5 శాతం మందిలో మాత్రమే ఉండే ఈ వ్యాధి ప్రస్తుతం 8 శాతానికి చేరింది. గతంలో 60 ఏళ్ల తర్వాత కనిపించే ఆస్టియోపోరోసిస్ ప్రస్తుతం 30 – 40 మధ్య వయస్సు వారిలోనే కనిపిస్తోంది. ఆస్టియోపోరోసిస్‌ను తెలుగులో బోలు ఎముకల వ్యాధి అంటారు. ఈ వ్యాధితో మనిషి ఎముక మెత్తబడుతుంది. ఎముకల్లో ఖనిజ సాంద్రత తగ్గుతుంది. దీనివల్ల ఎముక పై పొర పౌడర్‌గా పడిపోతుంది. తద్వారా ఎముకలు చాలా బలహీనం అవుతాయి.

వీరిలో వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువ

తగినంత సూర్యరశ్మి అందని వారికి, వ్యాయామం చేయని వ్యక్తులకు, 45 ఏళ్లు పైబడిన మహిళలకు, మెనోపాజ్ దశకు చేరుకున్న మహిళల్లో, మద్యపానం, పొగతాగే అలవాటు ఎక్కువగా ఉన్న వారిలో, శరీరంలో కాల్షియం స్థాయిలు తక్కువగా ఉన్న వారిలో ఈ వ్యాధి కనిపిస్తుంది. వెన్నునొప్పి, శరీరాకృతి వంగిపోవడం, ఎత్తు తగ్గుతున్నట్లు కనిపించడం, చిన్న ప్రమాదాలకే ఎముకలు విరిగిపోవడం వంటివి ఆస్టియోపోరోసిస్ వ్యాధి లక్షణాలు.



ఆస్టియోపోరోసిస్ సూచించే చిత్రం

వీటికి దూరంగా ఉండాలి

- మద్యం,దూమపానానికి దూరంగా ఉండాలి
- విపరీతమైన వ్యాయామం వల్ల యువతుల్లో అస్తవ్యస్త రుతుక్రమం,ఎముకలు పలచబడతాయి
- శీతల పానీయాలు అతిగా తీసుకోకూడదు.

వీటితో ప్రయోజనం

కొవ్వు లేని/మీగడలేని పాలు, సోయాపాలు, తృణధాన్యాలు తీసుకోవాలి. విటమిన్–డి కోసం రోజూ ఉదయం లేదా సాయంత్రం సూర్యరశ్మి తగిలేలా చూసుకోవాలి. చీజ్, గుడ్లు తినాలి.